సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 20 । జూన్ । 2025



మైత్రితో భరోసా

సిద్దిపేట జీజీహెచ్‌లో మైత్రి ట్రాన్స్ క్లినిక్ ద్వారా ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేక వైద్య సేవలందిస్తున్నారు. వివరాలు 10లో ▸



రైల్వే బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడు

మెదక్‌లోని చిన్నశంకరంపేటలోని రైల్వే అండర్ పాస్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. వివరాలు 10లో ▸



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాను జీవన విధానంలో భాగస్వామ్యం చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వివరాలు 11లో ▸

పారిశుద్ధ్య నిర్వహణ పక్కా

- ముమ్మరంగా కార్యక్రమాలు
- జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో అమలు
- రోజుకో కార్యక్రమం, ప్రజలకు అవగాహన
- వెంటాడుతున్న నిధుల సమస్య

వంద రోజుల ప్రణాళికకు రూపకల్పన



నారాయణఖేడ్: పట్టణ ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

నారాయణఖేడ్: వానాకాలం..వ్యాధుల కాలం కావడంతో పట్టణాల ప్రజలు అనారోగ్యాలకు దూరంగా ఉంటూ స్వచ్ఛ పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వందరోజుల ప్రణాళికకు రూపకల్పన చేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో భాగంగా జిల్లాలోని 12 మున్సిపాలిటీల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో అధికారులు, సిబ్బంది ప్రజల్లో ఉంటూ అవగాహన కల్పిస్తూ అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. జూన్ 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం సెప్టెంబర్ 10వరకు వంద రోజుల పాటు కొనసాగనుంది. సంపూర్ణ పారిశుద్ధ్యం, తాగునీరు, నీటి క్లోరినేషన్, నీటి పరీక్షలు, ముంపు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, గృహాల స్థాయిల్లోనే తడి, పొడి చెత్త వేరు చేయడం, కాలనీ వాసులు కమ్యూనిటీ కంపోస్టు తయారు చేసుకునేలా అవగాహన కల్పించడం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ మున్సిపాలిటీ ద్వారా తగు జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంది. దోమల నివారణకు ఫాగింగ్, గుంతలు పూడ్చడం, విద్యుత్ సమస్యలు నివారించడం వంటివి ఈ కార్యక్రమాల్లో చేపడతారు.

ఆదాయం సమకూర్చుకుంటూనే..

మున్సిపాలిటీకి పాలకవర్గాలు లేకపోవడం, సాధారణ నిధులు తప్ప ఆర్థిక సంఘం నిధులు వెసులుబాటు లేకపోవడంతో నిధుల సమస్య ఉత్పన్నమవుతున్నాయి. దీన్ని ఈ కార్యక్రమంలోనే అధిగమించేలా ఏర్పాట్లు చేపట్టారు. తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేసుకున్న వాటిని భువన్ యాప్ ద్వారా సర్వే చేసి ట్యాక్స్ రివైజ్ చేయనున్నారు. లైసెన్సులేని దుకాణాలను గుర్తించి లైసెన్సును ఇప్పించనున్నారు. వీధి వ్యాపారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించడం, వన మహోత్సవం కింద మొక్కలు నాటడం, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలనపై వాల్‌పెయింటింగ్స్ ద్వారా అవగాహన కల్పించనున్నారు. పట్టణాల్లోని విద్యాసంస్థల విద్యార్థులతో పరిశుభ్రతా అంశాలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేయనున్నారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితోనే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాత మున్సిపాలిటీలతోపాటు రెండు నెలల క్రితం కొత్తగా ఏర్పాటైన గడ్డి పోతారం, కోహీర్, ఇస్నాపూర్, గుమ్మడిదల మున్సిపాలిటీల్లోనూ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

పారిశుద్ధ్యం దిశగా చర్యలు



పట్టణాన్ని సంపూర్ణ పారిశుద్ధ్యం దిశగా చర్యలు చేపడుతున్నాం. కాలనీల్లో మురుగు తొలగింపు, పరిశుభ్రతా పనులు చేపడుతున్నాం. గుంతలు పూడ్చటం, తాగునీటి సమస్యలను తీరుస్తున్నాం.

- శ్రీనివాస్, శానిటరీ అధికారి, నారాయణఖేడ్ మున్సిపాలిటీ

అవగాహన కల్పిస్తున్నాం



పట్టణ ప్రజలకు సంపూర్ణ పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపడుతున్నాం. జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నాం. వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేస్తాం.

- జగ్జీవన్, కమిషనర్, నారాయణఖేడ్ మున్సిపాలిటీ



ఈదులనాగులపల్లి ముఖద్వారం వద్ద రోడ్డు పక్కల పేరుకుపోయిన చెత్త

వార్డు అధికారులు ఎక్కడ?

- తెల్లాపూర్ మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఎక్కడి సమస్యలు అక్కడే అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి. రోజుల తరబడి రోడ్ల పక్క చెత్త పేరుకుపోతోంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్యాయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మున్సిపల్ పరిధిలో పూర్తి స్థాయిలో వార్డు అధికారులు ఉండి కూడా సమస్యలను అపరిష్కృతంగా వదిలేయడమేమిటో ప్రజలకు అర్థం కాకుండా ఉంది. వార్డు అధికారులకు పూర్తి బాధ్యతలు ఇచ్చినా వారు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో మున్సిపల్ పరిధిలో వార్డు అధికారులు ఎవరో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకే వార్డు అధికారులు పూర్తి బాధ్యతలు నిర్వర్తించడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. 17మందికిపైగా కిందస్థాయి అధికారులు ఖాళీగానే ఉంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులతోపాటు సిబ్బందికి బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మ్యాన్‌పవర్ ద్వారా హాజరు తీసుకోవడం పలువురు అధికారులకు కలసి వస్తుందని చర్చించుకుంటున్నారు.

నిర్లక్ష్య ధోరణి వదులుకోవాలి



మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. వందల కోట్ల నిధులను మంజూరు చేసింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంది. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-కొల్లూరి భరత్, మాజీ కౌన్సిలర్

చర్యలు తీసుకుంటాం



ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

-చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

న్యూస్‌రీల్

ఖేడ్‌కు ఐటీఐ మంజూరు

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఐటీఐ) మంజూరు అయ్యిందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్మిక ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖ జీవో నంబర్ 8 విడుదల చేసిందని గురువారం ఆయన విలేకరులకు వెల్లడించారు. ఖేడ్ నియోజకవర్గానికి ఐటీఐ అవసరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇటీవలే కలిసి కోరగా ఆయన ఇచ్చిన హామీ మేరకు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఖేడ్ మండలం జూకల్ శివారులో నిర్మించనుండగా ఈమేరకు అక్కడ అనువైన స్థలాన్ని ఎంపిక చేసినట్లు వివరించారు. ఐటీఐ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



ఎంపీ సురేశ్ షెట్కార్‌కు కేక్‌ను తినిపిస్తున్న పార్టీ కార్యకర్తలు

నారాయణఖేడ్/హత్నూర (సంగారెడ్డి)/సంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని గురువారం కార్యకర్తల మధ్య ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేకును కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. ఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తనస్వగృహం ఆవరణలో నాయకులు, కార్యకర్తల మధ్య కేకును కట్ చేశారు. సంగారెడ్డిలో ఐబీలో టీజీఐఐసీ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో, హత్నూర మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హాకీం, మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాహుల్‌గాంధీని దేశంలోని ప్రజలంతా భవిష్యత్తులో ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారన్నారు.

రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిజాంపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సీడీసీ చైర్మన్ రాంరెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భూ భారతితో సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు చేసిన వారికి రశీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, తహసీల్దార్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదరన్ సర్టిఫికెట్లను మంజూరు చేయాలి

సంగారెడ్డి టౌన్: దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున అందించే సదరన్ సర్టిఫికెట్లను వెంటనే అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య పేర్కొన్నారు. సంగారెడ్డిలోని డీఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల హక్కులపై న్యాయ అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం గురించి తెలుసుకోవాలని వారికి అవసరమై సలహాలు, సూచనలను జిల్లా న్యాయస్థానం అందిస్తుందని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: కేంద్రంలోని మోదీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను కార్మిక, కర్షక లోకం విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలం రుద్రారం శివారులో గల తోషిబా, కాజీపల్లి పారిశ్రామిక వాడలోని టీఐటీసీ పరిశ్రమల్లో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలపై కార్మికులు, కర్షకులు తిరగబడాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు రద్దు కోసం పోరాడాలని చెప్పారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే ప్రాథమిక, ఉన్నత పాఠశాల తరగతి గదులు, విద్యార్థుల నమోదు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు. మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి పాఠశాలను ప్రారంభించాలని స్పష్టం చేశారు. శ్మశాన వాటిక ఏర్పాటుకు భూమి కేటాయించడంపై తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డితో చర్చించారు. అందుకు సంబంధించిన ప్రాతిపాదనలు తయారు చేయాలన్నారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్లాట్ యజమానులకు గృహజ్యోతి పథకం అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, సీడీపీఓ జయరాం, ఎంఈఓ పీపీ రాథోడ్, డీఈ సత్యనారయణ, ఏఈ మైనిక, మేనేజర్ అఖిల్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 15కల్లా భూ సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ పి.ప్రావీణ్య
- జిల్లాలో 12వేల దరఖాస్తులు



భూ భారతి సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

నారాయణఖేడ్: జిల్లా వ్యాప్తంగా రైతుల భూ సమస్యలకు సంబంధించి 12వేల దరఖాస్తులు అందాయని వాటన్నింటినీ ఆగస్టు 15 నాటికల్లా పరిష్కరిస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య హామీనిచ్చారు. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి కార్యక్రమాన్ని చేపట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. నిజాంపేట్ మండలం రాంరెడ్డిపేట్ గ్రామంలో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి కలెక్టర్ పి.ప్రావీణ్య పాల్గొన్నారు. అనంతరం రాంరెడ్డిపేట్ గ్రామంలో రేషన్ దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి బియ్యం నాణ్యత, మూడునెలల బియ్యం పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి భూమిపూజ నిర్వహించారు. నిజాంపేట్ గ్రామంలో ఎరువుల దుకాణం పరిశీలించి స్టాకు వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...భూ భారతిలో సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారి సమస్యపై ఇరు పక్షాలను పిలిచి విచారించి న్యాయం చేస్తామన్నారు. బిల్లులు, పత్తి విత్తన ప్యాకెట్ల ట్యాగ్స్, స్టాక్ బోర్డు పరిశీలించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు నిర్ణీత ధరకు అందించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తూ రైతుల సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని తెలిపారు.

నాణ్యమైన వంటకాలు అందించాలి

సంగారెడ్డి జోన్: వీధి విక్రయదారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్స్ వంటి కార్యక్రమాలు మంచి వేదికగా నిలుస్తాయని, ఇందులో భాగంగా వినియోగదారులకు నాణ్యమైన వంటకాలు అందించాలని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ , మెప్మా ఆధ్వర్యంలో వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంగారెడ్డి పట్టణంలోని ప్రశాంతనగర్ కాలనీలో వీధి విక్రయదారుల ఫుడ్ ఫెస్టివల్‌ను, అమ్మకం స్టాళ్లను కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించారు.

రైతులందరికీ రైతు భరోసా

మంత్రి తుమ్మలను కోరిన కాటా



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక నాయకులతో ఆయన కలసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రాంతంలోని గుమ్మడిదల రైతుల మాత్రమే రైతుభరోసా నిధులు వస్తున్నాయని మిగతా వారికి రావడం లేదని వివరించారు. ఈ ప్రాంతంలో కొందరు రైతులు భూములను అమ్ముకోకుండా వాటినే నేటికీ సాగు చేసుకుంటు జీవిస్తున్నారని ఆయన మంత్రికి వివరించారు. మొత్తం 27,120 మంది రైతులు 43,302 ఎకరాల్లో సాగు చేస్తున్నారని వివరించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తోన్న అమానుష దాడులను వెంటనే ఆపాలని సీపీఎం డిమాండ్ చేసింది. పాలస్తీనాకు సంఘీభావంగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ...అమెరికా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం నశించాలన్నారు. ఇజ్రాయెల్ ఈ మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

ఎస్పీ పరితోశ్ పంకజ్



సమావేశంలో మాట్లాడుతున్న పరితోశ్ పంకజ్

సంగారెడ్డి జోన్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో గురువారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న నేరాల వివరాలను ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అత్యాచార, పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళిక ఉండాలని సూచించారు. అధికారులు సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారికి భరోసా కల్పించాలని సూచించారు. వివిధ రకాల నేరాలను ఛేదించడంలో ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం సేవల ఆధారంగానే ఛేదించగలిగామన్నారు. విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీసులను అభినందించి రివార్డులు ప్రకటించారు. ఈ సమీక్షలో డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, సైదా నాయక్, వెంకట్‌రెడ్డితోపాటు సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పాఠశాల గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం (పటాన్‌చెరు): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21న శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పటాన్‌చెరు డివిజన్‌లోని మైత్రి మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో ప్రతీ ఒక్కరూ పాల్గొనవచ్చని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, యోగా నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. అంతకుముందు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు రూ.37.50 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం మైత్రి మైదానంలో యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యోగ ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరికి తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. యోగా ద్వారా పరిపూర్ణమైన మానసిక సమతుల్యత ఏర్పడుతుందని మహిపాల్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అదనంగా రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో తరగతి గదులకు పెయింటింగ్, ఫ్లోరింగ్, బొమ్మలు, క్రీడా ప్రాంగణాలను ఆధునీకరించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో అరుణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, హనుమంత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ‘అమృత భారత్’ పనులు

- జహీరాబాద్ రైల్వేస్టేషన్ సుందరీకరణకు రూ.24కోట్లు మంజూరు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో ముందుకు సాగని వైనం



రైల్వే స్టేషన్ వద్ద నిలిచిన ప్రధాన ద్వారం పనులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రైల్వేస్టేషన్ సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిన ప్రారంభించిన ‘అమృత భారత్’పనులు అధికారుల పర్యవేక్షణ లోపంతో వేగం పుంజుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులు పూర్తికావడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో సంబంధిత అధికారులను అడిగినా సమాధానం చెప్పలేకపోతున్నారు.

మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు

జహీరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతి, లాతూర్, విజయవాడ, షిర్డీ, సికింద్రాబాద్, హైదరాబాద్, వికారాబాద్, పూర్ణ, నాందేడ్, బెంగళూర్, బీదర్ తదితర ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉండగా ప్రతి రోజు వెయ్యి మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సుందరీకరణ పనులు కొనసాగుతుండటంతో ప్రస్తుతం స్టేషన్‌లో సదుపాయలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. మౌలిక సదుపాయలైన సులభ్ కాంప్లెక్స్, తాగు నీటి సౌకర్యం లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండో ప్లాట్‌ఫాం వైపు ఎలాంటి సౌకర్యాలు లేవు. దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ‘అమృత్ భారత్’స్టేషన్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఎంపిక చేసిన రైల్వేస్టేషన్లు దీర్ఘకాలిక ప్రాతిపదికన అభివృద్ధి చేస్తుంటారు. రాష్ట్రంలోని 39 స్టేషన్లను ఈ పథకం కింద చేర్చగా మొదటి దశలో 21 స్టేషన్లను ఎంపిక చేసింది. అందులో జహీరాబాద్ రైల్వేస్టేషన్ కూడా ఉంది. ఈ పథకం కింద జహీరాబాద్‌కు రూ.24.4 కోట్లను మంజూరు చేసి ప్రధాని మోదీ వర్చువల్‌గా గతేడాది ఆగస్టు 6న శంకుస్థాపన చేశారు.

ఆరంభ శూరత్వమే...

రైల్వేస్టేషన్‌లో ఒక ప్లాట్ ఫాం ఉండగా రెండవ ప్లాట్‌ఫాంను నిర్మించాల్సి ఉంది. మొదటి ప్లాట్‌ఫాంను కూడా విస్తరించాల్సి ఉంది. ఆధునిక టికెట్ కౌంటర్, మోడల్ షాపింగ్ మాల్, సులభ్ కాంప్లెక్స్ పనులతో పాటు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో మొక్కల పెంపకం, గార్డెన్ నిర్మాణం పనులు చేపట్టాలి. రెండు బుకింగ్ కౌంటర్‌లు, తాగునీరు సౌకర్యం, కొత్తగా స్టేషన్ మాస్టర్ ఆఫీస్, వెయిటింగ్ హాల్, మోడ్రన్ టాయిలెట్స్, ప్రధాన ద్వారం తదితర అభివృద్ధి పనులు జరగాల్సి ఉంది. గతేడాది దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కేకేబీ గుప్తా, అదనపు డివిజనల్ ఇంజనీర్ ఎల్.భిక్షపతి తదితరులు పనులను పర్యవేక్షించారు. అప్పటివరకు చురుగ్గా సాగిన పనులు ఆ తర్వాత బాగా నెమ్మదించాయి. రైల్వేశాఖ అధికారులు దృష్టి సారించి అమృత్ భారత్ పనులను త్వరగా పూర్తి చేసి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

కొమురవెల్లి(సిద్దిపేట): మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం... కొన్ని రోజుల క్రితం వాహనాలు తనిఖీ నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న ములుగు మండల కేంద్రానికి చెందిన కొండు వినయ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం చేర్యాల సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు: కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడ్డ అత్తింటివారిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన దొంతి సారికను మెదక్ పట్టణంకు చెందిన కిశోర్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు పుట్టడంతో ఆదనపు కట్నం కోసం భర్త వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతోపాటు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేయడంతో పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదు. సంవత్సరం క్రితం భార్యను పుట్టింట్లో వదిలేసి వెళ్లాడు. భర్తకు అత్త, మామ, మరిది వత్తాసు పలుకుతుండటంతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాటరీ దొంగలు రిమాండ్

నిజాంపేట(మెదక్): పలు సెల్ టవర్లలో బ్యాట రీలను దొంగిలిస్తున్న నిందితులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజేశ్ కథ నం ప్రకారం.. నాలుగు నెలల క్రితం నిజాంపేటలోని పలు టవర్లలో 48 బ్యాటరీలను అలాగే రామాయంపేట, చిన్న శంకరంపేట పరిధిలో టవర్స్‌కు సంబంధించి బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితులు డి. ధర్మారం గ్రామానికి చెందిన గుర్రం శ్రీకాంత్, గుర్రం యాదగిరిలను రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా తమ ఇంటికి తాళం వేసి వేరే గ్రామాలకు వెళ్తున్నట్లు అయితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వా లని సూచించారు. విలువైన ఆభరణాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మరొక ఘటనలో..

నిజాంపేట(మెదక్): చోరీ కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రాజేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలో గత నెల 30న కల్వకుంట గ్రామ శివారులో గల పెద్దమ్మ, గంగమ్మ దేవాలయాల్లో చోరీ జరిగింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిద్దిపేట జిల్లాలోని భూంపల్లి మండలానికి చెందిన తాళ్లపల్లి గ్రామంలోని ఆందోల్ నవీన్‌ను గురువారం అరెస్టు చేశారు.

మహిళ అదృశ్యం


పద్మ

సంగారెడ్డి క్రైమ్: ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన తిరుకు వెళ్లురు మురళి, పద్మ(62) దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. అందరూ వేర్వేరుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. దంపతుల మధ్య గొడవలు పెరగడంతో కుటుంబసభ్యులు పలుమార్లు ఇరువురిని మందలించారు. కోపంతో ఈ నెల 16న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన పద్మ తిరిగి రాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రి నుంచి వ్యక్తి..


రమేశ్

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన సాలే రమేష్ (35), తన భార్య పుష్ప అనారోగ్యం నిమిత్తం ఈ నెల13న ఆమెను సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాడు. ఆమె ఐసీయూలో చికిత్స పొందుతుంది. అప్పటి నుంచి రమేష్ కనిపించడం లేదు. తండ్రి యాదయ్య బుధవారం ప్రభుత్వ ఆస్పత్రిలో, చుట్టుప్రక్కల వెతికాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని నాగ్సాన్‌పల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేష్ గౌడ్ వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా వాల్కండేయ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బీరప్ప(40), లారీ క్లీనర్ జై భీమ్(39)తో కలిసి లారీలో లోడ్ నింపుకొని హుమ్నాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. మార్గ మధ్యలో జాతీయ రహదారి 65పై నాగ్సాన్‌పల్లి శివారులో ఓ టీ పాయింట్ సమీపంలో లారీని (ఎంహెచ్ 09 ఎఫ్‌ఎల్ 9657) డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచాడు. ఈ క్రమంలో బీరప్ప లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బీరప్పతోపాటు క్లీనర్ జై భీమ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైత్రితో భరోసా

- సిద్దిపేట జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు
- గతేడాది డిసెంబర్‌లో క్లినిక్ ప్రారంభం
- మంగళ, గురువారాల్లో ప్రత్యేక సేవలు
- ఇప్పటి వరకు 86మందికి


ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులు

సిద్దిపేటకమాన్: సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అంటే చాలా మందికి చిన్న చూపు ఉంటుంది. వారిపై వివక్షతో పాటు విసుగు ప్రదర్శిస్తారు. ట్రాన్స్‌జెండర్లకు కుటుంబ సభ్యుల తోడ్పాటు కూడా కరువై ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారికి ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే ఆస్పత్రులకు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వారి సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సమాన గౌరవం సమగ్ర వైద్యం పేరుతో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వ ఆస్పత్రులలో వారానికి రెండు రోజులు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో గతేడాది డిసెంబర్‌లో క్లినిక్‌ను ప్రారంభించారు.

వారంలో రెండు రోజులు

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్ ద్వారా వారంలో రెండు రోజులు ప్రతి మంగళ, గురువారాల్లో ట్రాన్స్‌జెండర్లకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, సైకియాట్రిక్ విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి ప్రత్యేక పర్యవేక్షణలో సేవలు అందుతున్నాయి. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ఇక్కడ వైద్యం చేయించుకోవచ్చని తెలిపారు. క్లినిక్‌లో కౌన్సిలింగ్, సాధారణ ఆరోగ్య సేవలు, లింగ ఆధారిత సేవలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స (ఎస్‌టిఐ, ఆర్‌టిఐ), సామాజిక అర్హత సేవలు, ఇతర క్లినికల్, ల్యాబ్ సేవలు, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిక్ సేవలు సైతం అందిస్తున్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

86 మందికి వైద్యం

క్లినిక్‌ను గతేడాది డిసెంబర్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 86 మంది వైద్య సేవలు పొందారు. గతేడాది డిసెంబర్‌లో 15మంది, ఈ ఏడాది జనవరిలో 17, ఫిబ్రవరిలో 14, మార్చిలో 13, ఏప్రిల్‌లో 10, మే నెలలో 12, జూన్‌లో ఇప్పటి వరకు ఐదుగురికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారులు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు హెల్ప్‌లైన్ నంబర్ 155326 అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గతేడాది డిసెంబర్‌లో మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఏర్పాటు చేశాం. ఈ క్లినిక్ ద్వారా ట్రాన్స్‌జెండర్లకు వారంలో రెండు రోజులు మంగళ, గురువారాల్లో వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ శాంతి, సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, సిద్దిపేట

దర్గాకు వెళ్తుండగా కారు బోల్తా

- ఇద్దరు యువకుల దుర్మరణం
- నర్సింగరావుపల్లిలో విషాద ఛాయలు


లునావత్ పీర్యా


కెతావత్ పీర్యా

పాపన్నపేట(మెదక్): మొక్కులు చెల్లించుకునేందుకు దర్గాకు వెళ్తుండగా మార్గ మధ్యలో కారు బోల్తాపడి ఇద్దరు గిరిజనులు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని నర్సింగరావుపల్లి గిరిజన తండాకు చెందిన లునావత్ పీర్యా (37) సంగారెడ్డిలో డోజర్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కొడుకు సోను చీకోడ్ హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి, చిన్న కొడుకు ప్రవీణ్ 7వ తరగతి చదువుతున్నారు. అదే తండాకు చెందిన కెతావత్ పీర్యా(37)కు భార్య శారద, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. లునావత్ పీర్యా తన మొక్కు చెల్లించుకోవడానికి బుధవారం తన యజమాని కారు తీసుకొని, సంగారెడ్డి నుంచి నర్సింగరావుపల్లికి వచ్చాడు. ముందుగా అనుకున్నట్లుగా తన ఇద్దరు కొడుకులతో పాటు, తండాకు చెందిన కెతావత్ పీర్యా, వేణులతో కలిసి రాత్రి పెద్ద గుట్టకు బయలు దేరారు. ఈ క్రమంలో మల్లయ్యపల్లి గేటు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడగా లునావత్ పీర్యా, కెతావత్ పీర్యా దుర్మరణం చెందారు. సోనుకు పక్కటెముకలు, ప్రవీణ్‌కు కాలు విరిగింది. వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం అనంతరం గురువారం సాయంత్రం కుటుంబీకులకు మృతదేహాలను అప్పగించారు. గిరిపుత్రుల రోదనల మధ్య ఇద్దరు యువకుల అంతిమ యాత్ర కొనసాగింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

జహీరాబాద్ టౌన్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుర్దిపాడ్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. తూంకుంటకు చెందిన చంద్రన్న(55) పొలానికి రైలు పట్టాలు దాటి వెళ్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్ చెట్టును ఢీకొని..

దుబ్బాకటౌన్: ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... దౌల్తాబాద్ మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన రంగంపేట సత్తయ్య (45) ద్విచక్ర వాహనంపై గజ్వేల్ వైపు వెళ్తుండగా వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకుమార్ (45) ఈ నెల 18న పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని నోవాపాన్ చౌరస్తాలో జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో సంగారెడ్డి వైపు వెళ్లే ద్విచక్ర వాహనం అతడ్ని ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య


శ్రీకాంత్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నాగారం శ్రీకాంత్(26) అవసరాల నిమిత్తం కొందరివద్ద అప్పులు తీసుకున్నాడు. ఈ క్రమంలో తీర్చే మార్గం లేకపోవడంతో తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. తల్లి శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై..


ఉరివేసుకున్న జాఫర్

చేర్యాల(సిద్దిపేట): ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పి.నీరేష్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎండీ.జాఫర్(40) మేస్త్రీ పనులు చేస్తున్నాడు. కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలోనే గురువారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు పోసుకొని వివాహిత..

గజ్వేల్‌రూరల్: మతిస్థిమితం సరిగా లేని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... మేడ్చల్ జిల్లాకు చెందిన నల్ల రేణుకకు జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌కు చెందిన ఎల్లంతో 2022లో వివాహం జరిగింది. కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ రేణుక అనారోగ్యానికి గురై మతిస్థిమితం కోల్పోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఎర్రగడ్డలోని మెంటల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ఏడాది నుంచి తల్లిగారింటి వద్దే ఉన్న రేణుక ఈనెల 16న భర్త వద్దకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ నుంచి జగదేవ్‌పూర్ మార్గంలో ఓ నర్సరీ సమీపంలో ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, వైద్యుల సూచన మేరకు ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ నరేందర్‌గౌడ్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం

తూప్రాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సైబర్ నేరాలు విరివిగా పెరిగాయని తెలిపారు. గతంలో పట్టణాల్లో మాత్రమే జరగగా, ప్రస్తుతం రూరల్ ఏరియాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. సులువుగా డబ్బులు సంపాదించాలని కేటుగాళ్లు బ్లాక్ మెయిల్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. బ్యాంకు ఖాతాలు, ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కాగా రూరల్ ఏరియాల్లో కళాజాత ప్రదర్శనలతో ప్రజలను చైతన్య పరచడంతో పాటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలకు పాల్పడిన వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే మోసాలను అరికట్టడంతో పాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం పాల్గొన్నారు.

దేశ పురోగతికి పెద్దపీట: బూర నర్సయ్య గౌడ్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్

చేర్యాల(సిద్దిపేట): ప్రధాని మోదీ పాలనలో భారత దేశం ఎంతో పురోగతి సాధించిందని భువనగిరి మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం స్థానిక గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో దేశ ప్రజలు ఇబ్బంది పడ్డారని, దేశాన్ని విచ్ఛిన్నం చేసి ఓటు బ్యాంకు రాజకీయాలు చేసిందని విమర్శించారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి వస్తువులను ఎగుమతి చేసే స్థాయికి దేశం ఎదిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవులుగౌడ్, పట్టణ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమారాణి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

మహిళల రక్షణే ప్రథమ కర్తవ్యం

షీటీమ్, భరోసా సమావేశంలో సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణే ప్రథమ కర్తవ్యమని సీపీ అనురాధ అన్నారు. గురువారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, భరోసా సెంటర్ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షీటీమ్, భరోసా సిబ్బంది, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏ సమయంలో ఫోన్ వచ్చినా వెంటనే ఘటనా స్థలానికి వెళ్లాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. షీటీమ్ సిబ్బంది ఫోన్ నంబర్లు పాఠశాలలు, కళాశాలల వద్ద కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల పోలీసు అధికారులు పాల్గొన్నారు. కాగా, మహిళను కాపాడిన హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌ను సీపీ సన్మానించి, నగదు రివార్డు అందజేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు


గౌరవెల్లి ప్రాజెక్టుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): మాజీ ప్రజాప్రతినిధి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించాడు. సదరు వ్యక్తికి కొంత పట్టా భూమి ఉండగా దానికి ఆనుకొని ప్రభుత్వ భూమి ఉంది. ఇదే అదనుగా భావించి జేసీబీ సహాయంతో బండరాళ్లను తొలగించి చదును చేస్తున్నాడు. మండలంలోని గౌరవెల్లి శివారులోని సర్వే నం.139లో 39 ఎకరాల 39 గుంటల ప్రభుత్వ భూమి ఉంది. అందులో గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంలో సుమారుగా 17 ఎకరాల వరకు ముంపునకు గురికాగా, మిగిలిన 22ఎకరాల ప్రాజెక్టు కట్టకు ఆనుకొని ఉంది. అయితే గౌరవెల్లి, గుబ్బడి శివారు సరిహద్దులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు, నాయకులు కలిసి ఇటీవల ఆర్డీఓకు ప్రభుత్వ భూమి అక్రమణలకు గురవుతుందని ఫిర్యాదులు చేశారు. సర్కారు భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. అయినా అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ అనంతరెడ్డిని వివరణ కోరగా ప్రాజెక్టుకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని వెంటనే సందర్శించి విచారణ చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే ఎంతటి వారైనా వదలబోమని హెచ్చరించారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


నిరసన వ్యక్తం చేస్తున్న దుబ్బాక మున్సిపల్ ఉద్యోగులు

ఉద్యోగుల నిరసన

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగిపై కాంట్రాక్టర్ బుధవారం దురుసుగా ప్రవర్తించాడు. ఏఈకి సంఘీభావంగా గురువారం తోటి ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో శ్రీకాంత్ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. మున్సిపల్ కార్యాలయానికి జేసీబీ వాహనాన్ని అద్దెకిచ్చే కాంట్రాక్టర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి జేసీబీ బిల్లు మంజూరు కోసం బుధవారం సాయంత్రం కూడా వచ్చాడు. ఈ క్రమంలో ఏఈ జేసీబీతో చేసిన పనులకు సంబంధించి కొన్ని ఫొటోలు లేవని, బిల్లులపై సంతకం పెట్టేందుకు తిరస్కరించారు. దీంతో కోపానికి గురైన కాంట్రాక్టర్ ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, దురుసుగా ప్రవర్తించాడు. అసభ్య మాటలను రికార్డు చేస్తున్న ఏఈ ఫోన్‌ను ధ్వంసం చేశాడు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిషనర్ రమేశ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఆస స్వామిని వివరణ కోరగా.. తనకు రావాల్సిన రూ.24 వేల జేసీబీ బిల్లుకు సంబంధించి చేసిన పనులకు కొన్ని ఫొటోలు లేవనే సాకుతో బిల్లు మంజూరు చేయకుండా ఏఈ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఆవేశంలో కొంత దురుసుగా ప్రవర్తించానని చెప్పారు.

పోలీసులపై దాడి కేసులో నలుగురు అరెస్టు

చేగుంట(తూప్రాన్): కిడ్నాప్ కేసులో విచారణకు వచ్చిన పోలీసులపై దాడి చేసిన కేసులో నలుగురిని అరెస్టు చేశారు. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం... నిర్మల్ జిల్లా భైంసా టౌన్ ప్రొబేషనరీ ఎస్‌ఐ షేక్ జుబేర్ సిబ్బందితో కలిసి బాలిక కిడ్నాప్ కేసు విచారణ నిమిత్తం బుధవారం చేగుంట మండలం బోనాల్ కొండాపూర్ గ్రామం బ్యాగరి చంద్రం ఇంటికి వెళ్లారు. పోలీసులకు సరైన సమాధానం చెప్పకపోగా చంద్రం కుటుంబీకులు ఎస్‌ఐతో పాటు సిబ్బందిని చంపుతామని బెదిరిస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో భైంసా పోలీసులకు గాయాలైనట్లు తెలుసుకున్న చేగుంట పోలీసులు బీకొండాపూర్‌కు వచ్చారు. వారిని సైతం అడ్డుకొని శరత్‌చంద్ర అనే కానిస్టేబుల్‌ను తీవ్రంగా గాయపరిచారు. దాడి విషయంలో షేక్ జుబేర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులపై దాడికి పాల్పడిన సురేష్, చంద్రం, రత్నవ్వ, సంజీవ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

రైల్వే బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడు?

- నత్తనడకన సాగుతున్న కామారం, సంకాపూర్ పనులు
- పంటపొలాలకు వెళ్లేందుకు గిరిజనుల ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు


కామారం తండాలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్‌పాస్

చిన్నశంకరంపేట(మెదక్): రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పంట పొలాలకు వెళ్లేందుకు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని మండలంలోని కామారం తండా గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాకు వెళ్లే శంకరంపేట–కామారం తండా రహదారిపై ఉన్న రైల్వే క్రాసింగ్ గేట్‌ను డిసెంబర్‌లో తొలగించి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు పనులు ప్రారంభించారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని అప్పట్లో గిరిజనులకు రైల్వే అధికారులు హామీ ఇచ్చారు. పనులను చూస్తే ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. రైల్వేగేట్ మూసి వేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు గిరిజనులు తెలిపారు.

బ్రిడ్జి పలకలు సిద్ధం కాలేదు

రైల్వే అండర్ పాస్ కోసం వినియోగించే పలకలు(రింగ్‌లు) ముందుగానే సిద్ధం చేసుకున్న తరువాతే రహదారిని మూసివేస్తారు. కానీ, ఇక్కడ ముందుగానే మూసివేసి సిద్ధం చేస్తున్నారు. ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే పలకల నిర్మాణం చేపట్టారు. ఇలా పనులు జరిగితే ఇంకా ఆరు నెలలైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు పనుల నిర్వహణను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

సంకాపూర్‌లోనూ ఇదే పరిస్థితి

నార్సింగి మండలం సంకాపూర్ రైల్వేగేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణ పనులు కూడా అలస్యమవుతున్నాయి. ఇక్కడ పట్టాల కింద వేసేందుకు ముందే సిద్ధం చేసుకున్న పలకలు(రింగ్‌లు) అమర్చినప్పటికీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించిన రైల్వే అధికారులు ఒక వైపు రహదారి నిర్మాణం కోసం మట్టి తవ్వకాలు చేస్తున్నారు. రెండు నెలలుగా మట్టిని తవ్వుతున్నప్పటికీ సిమెంట్ పనులు మాత్రం చేపట్టడం లేదు. సంకాపూర్ రైల్వేగేట్‌కు ఇరువైపులా తండా ప్రజలు జీవిస్తున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు సైతం రైల్వే పట్టాలను క్రాస్ చేసి వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా పూర్తి చేయాలి



రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను వేగంగా పూర్తి చేయాలి. నిర్మాణం కోసం రైల్వేగేట్ మూసివేసి కొంత వరకు రోడ్డును తవ్వేయడంతో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. దీంతో పాటు కనీసం పంట పొలాలకు వెళ్లేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నాం. రైల్వే అధికారులు స్పందించి పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– మోహన్ నాయక్, కామారం తండా